సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 3 । జూలై । 2023



మిడ్‌మానేరులో 17 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో నీటిమట్టం 17.94 టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీలోకి ఆదివారం1,265 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సాయిచంద్ మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న రచయితలు

సిరిసిల్ల: కవి, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం తీరని లోటని తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు పేర్కొన్నారు. సిరిసిల్ల నేతన్నచౌక్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం సాయిచంద్ చిత్రపటానికి నివాళి అర్పించారు. పర్శరాములు మాట్లాడుతూ సామన్య కుటుంబంలో పుట్టిన సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ మాట్లాడుతూ సాయిచంద్ పేరిట అవార్డులు అందిస్తానన్నారు. తెలంగాణ వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి రాచర్ల వెంకన్న, సాహిత్యకారులు జనపాల శంకరయ్య, వెంగళ లక్ష్మణ్, కనపరిత జగదీశ్వర్, బిట్ల సుమన్ పాల్గొన్నారు.

11న శీత్లాభవాని పండుగ



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న రాజునాయక్

సిరిసిల్లటౌన్: ఆలిండియా బంజారా సేవా సంఘం నిర్ణయం మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఒకే రోజున శీత్లాభవాని వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాజునాయక్ తెలిపారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 11న శీత్లాభవాని పండుగ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. గిరిజనులు అందరూ ఐక్యతతో పండుగను జరుపుకోవాలని కోరారు. సురేష్‌నాయక్, తిరుపతినాయక్, ప్రభునాయక్, కళ్యాణ్‌నాయక్, రవిలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని ఆరు మండలాల్లో ఆదివారం చిరుజల్లులు పడ్డాయి. ఏడు మండలాల్లో చినుకు జాడే లేదు. ముస్తాబాద్‌లో అత్యధికంగా 8.2 మిల్లీమీటర్ల వర్షం పడగా.. గంభీరావుపేటలో 3.5, ఇల్లంతకుంటలో 3.7, తంగళ్లపల్లిలో 1.5, కోనరావుపేటలో 1.4, ఎల్లారెడ్డిపేటలో 0.8 మిల్లీమీటర్ల వర్షం పడింది.

అర్హులకు పట్టాలు అందివ్వాలి



నిమ్మపల్లిలో మాట్లాడుతున్న నరేశ్‌కుమార్

కోనరావుపేట(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పోడు పట్టాల పంపిణీలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరిని అర్హులుగా ప్రకటించాలని లైవ్(లంబాడీ హక్కుల ఐక్య వేదిక) జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ కోరారు. నరేశ్‌కుమార్ మాట్లాడుతూ పోడు భూముల పట్టాల పంపిణీలో దరఖాస్తులు చేసుకున్న వారిలో సగం మంది దరఖాస్తులలో సగానికి పైగా మంది దరఖాస్తుదారులను గుర్తించకపోవడంతో విచారకరమన్నారు. గ్రామసభ తీర్మానించిన వారని హక్కుదారులుగా గుర్తిస్తామని ప్రకటించిన ప్రభుత్వం కొద్దిమందినే గుర్తించడం న్యాయం కాదన్నారు. త్వరలో ఎలక్షన్ కోడ్ రాబోతున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లలో రెండో విడతగా ప్రకటించాలన్నారు. నాయకులు ప్రకాశ్‌నాయక్, మోహన్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



రుద్రంగి(వేములవాడ): పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ చల్మెడ ఆనందరావు జనరల్ ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రుద్రంగికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మంచె రాజేశంను ఆదివారం పరామర్శించారు. రుద్రంగి శ్రీలక్ష్మీనరసింహా స్వామి ఆలయ కమిటీ, ఆర్యవైశ్య, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఉప్పులూటి గణేశ్, మోతె నర్సయ్య, పాల నర్సయ్య, నారాయణ, దాసరి గంగరాజం పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే..

- అధికార పార్టీ శ్రేణుల్లో సందిగ్ధం
- బీఆర్‌ఎస్ టిక్కెట్‌పై ఉత్కంఠ
- చెన్నమనేని వర్సెస్ చల్మెడ
- ఇద్దరిదీ రాజకీయ వారసత్వం
- ఒకే ప్రాంతం..ఒకే సామాజికవర్గం
- వేడెక్కిన వేములవాడ రాజకీయం

సిరిసిల్ల:

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇంకా ఐదు నెలల సమయం ఉంది. అప్పుడే వేములవాడ నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం మొదలైంది. అధికార బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఎటు వైపు వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు ఈసారి బీఆర్‌ఎస్ టిక్కెట్ రాదని, అక్కడ చల్మెడ లక్ష్మీనర్సింహరావు పోటీ చేస్తారని కొందరు భావిస్తుండగా.. అదేం లేదు.. మళ్లీ రమేశ్‌బాబుదే ఆ సీటు అంటూ మరికొందరు చెబుతున్నారు. ఏది ఏమైనా అధికార బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో ఇప్పుడు సందిగ్ధం నెలకొంది. ఎవరితో సన్నిహితంగా ఉండాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.



ఇద్దరితోనూ టచ్‌లో ఉన్న అధిష్టానం

ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను కలిసి వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధించారు. ఆ నిధులతో చేపట్టే పనులకు మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానించారు. మరోవైపు కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ పూర్తి కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఆ రిజర్వాయర్‌ను ప్రారంభించాలని భావిస్తున్నారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని మల్కపేటలో జరిగే కార్యక్రమాలకు సీఎం వస్తారని మంత్రి కేటీఆర్ ఇటీవల వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు సీఎం కేసీఆర్ ఆశీస్సులతో వేములవాడ టిక్కెట్ సాధిస్తారని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. మరోవైపు చల్మెడ లక్ష్మీనర్సింహరావు మంత్రి కేటీఆర్‌తో ఇటీవల సన్నిహితంగా ఉంటూ బీఆర్‌ఎస్ పార్టీ పనులను చక్కబెడుతున్నారు. సిరిసిల్లకు ఇటీవల టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి రాగా.. ఆయన వెంట తిరుగు ప్రయాణంలో హెలీకాప్టర్‌లో లక్ష్మీనర్సింహరావును కేటీఆర్ పంపడం విశేషం. అనంతరం వేములవాడలో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించిన లక్ష్మీనర్సింహరావు పాతతరం టీఆర్‌ఎస్ నేతలతో కలిసి ముందుకుసాగుతున్నారు. అధిష్టానం ఆదేశిస్తే వేములవాడలో పోటీచేస్తానని, ప్రజలకు సేవ చేస్తానని ఈ సందర్భంగా ప్రకటించడం గమనించాల్సిన విషయం. బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం నుంచి స్పష్టమైన హామీ ఉండడంతోనే చల్మెడ ముందుకు సాగుతున్నారనే ప్రచారం సైతం ఉంది. ఇటీవల చెన్నమనేని రమేశ్‌బాబు మంత్రి హరీశ్‌రావును కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం ఇద్దరితోనూ టచ్‌లో ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి.

ఇద్దరిదీ రాజకీయ వారతస్వమే

సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్‌బాబు తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు రాజకీయ వారసత్వంతో తెరపైకి వచ్చారు. సేవ్స్ సంస్థ ద్వారా స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టారు. తొలిసారి 2009లో మహాకూటమి(టీడీపీ) అభ్యర్థిగా వేములవాడ బరిలో నిలిచి విజయం సాధించారు. అప్పటి నుంచి 2010 ఉపఎన్నికలు, 2014, 2018 ఎన్నికల్లోనూ వరుస విజయాలు సాధించారు. రమేశ్‌బాబును జర్మనీ పౌరసత్వ వివాదం వెంటాడుతోంది. మరోవైపు చల్మెడ లక్ష్మీనర్సింహరావు సైతం తన తండ్రి మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు రాజకీయ వారసత్వంతో తెరపైకి వచ్చారు. కరీంనగర్ కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో చురుగ్గా ఉన్న లక్ష్మీనర్సింహరావు ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. చల్మెడ వైద్యవిజ్ఞాన సంస్థ ద్వారా పల్లెల్లో స్వచ్ఛంద సేవ చేస్తున్నారు. వేములవాడ నియోజకవర్గం కేంద్రంగా ఇప్పుడు చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలదీ ఒకే సామాజికవర్గం కావడం, కోనరావుపేట మండలంలోని సమీప గ్రామాలైన నాగారం, మల్కపేటకు చెందిన వారు కావడం విశేషం.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో అయోమయం

ఇద్దరు నేతలు ఎవరికి వారు ఎన్నికల బరిలో నిలిచేందుకు ధీమాగా వేములవాడ నియోజకవర్గంలో పనిచేస్తుండడంతో ఆ పార్టీ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నాయి. బీఆర్‌ఎస్ పాత తరం నేతలను కలుస్తూ.. పలువురు ప్రజాప్రతినిధులను కలుస్తూ.. లక్ష్మీనర్సింహరావు ముందుకు సాగుతుండగా.. ఎమ్మెల్యే రమేశ్‌బాబు సైతం తనదైన శైలిలో పార్టీ శ్రేణులతో టచ్‌లో ఉంటున్నారు. బీఆర్‌ఎస్ టిక్కెట్ విషయంలో పార్టీ నేతల అంచనాలు తారుమారైతే రాజకీయంగా భవిష్యత్ అంధకారమవుతుందని ఇరువర్గాల పార్టీ శ్రేణుల్లోనూ ఉంది. కొందరు ముఖ్యనేతలు ఇద్దరితోనూ టచ్‌లో ఉంటూ.. వేచిచూసే ధోరణిలో ఉన్నారు. మొత్తానికి వేములవాడ రాజకీయాలు ముందే వేడెక్కగా.. పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.'తాత ఏమైనా చెప్పాడారా నర్సీ' అంటూ 'బలగం' సినిమాలో ఓ డైలాగ్ ఉంటుంది కదా.. ఇదే తరహాలో బీఆర్‌ఎస్ అధిష్టానం ఎవరికి ఏం చెప్పి ఉంటుంది ? అనే సందేహాలు శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి.



హరహర మహాదేవ

వేములవాడ: రాజన్నను ఆదివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి తడి బట్టలతో కోడెమొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బహ్రెయిన్‌లో బందీగా గిరిజన యువకుడు

- నెల క్రితం పని కోసం గల్ఫ్‌బాట
- మనమ సెంటర్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు
- ఇండియా ఎంబసీ నుంచి కుటుంబీకులకు సమాచారం



భూక్య శర్మన్



జైలు నుంచి విడిపించాలని మంత్రి కేటీఆర్‌ను వేడుకుంటున్న పద్మ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సొంతూరిలో ఉపాధి లేక ఎడారిలోని బహ్రెయిన్‌కు వెళ్లిన ఓ నిరుపేద గిరిజనుడు అక్కడి జైలులో బందీ అయ్యాడు. ఇండియా ఎంబసీ ద్వారా ఆదివారం కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గిరిజనుడు భూక్య శర్మన్ (40) నెల రోజుల క్రితం పని వెతుక్కునేందుకు విజిట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లాడు. 15 రోజుల తర్వాత ఫోన్‌లో బ్యాలెన్స్ వేసుకునేందుకు గదిలో నుంచి బయటకు వెళ్లాడు. అప్పుడే మనమ సెంటర్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వారి కోసం పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో బయటకు వచ్చిన శర్మన్‌ను చూసిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించకుండానే ఒస్కర్ జైలుకు తరలించారు. ఈ విషయం ఇండియా ఎంబసీ ద్వారా ఆదివారం ఎల్లారెడ్డిపేట పోలీసులకు తెలియగా.. వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎలాంటి సంబంధం లేని శర్మన్‌పై అక్కడి పోలీసులు అక్రమ మద్యం విక్రయం కేసులో జైలుకు తరలించినట్లు తెలిపారని భార్య పద్మ చెప్పారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన తన భర్తను అన్యాయంగా పోలీసులు జైలులో వేశారని ఆరోపించింది. ఇండియా ఎంబసీతో మాట్లాడి తన భర్తను విడిపించాలని పద్మ మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేస్తోంది. తన భర్తను జైలు నుంచి ఇంటికి పంపించే ఏర్పాట్లు చేయాలని వేడుకుంటోంది.

ఎన్గల్‌లో వీడని ఉత్కంఠ

- యువతి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు
- యువకుల బంధువుల ఇళ్లలో విచారణ



ఎన్గల్‌లో యువకుల కోసం ఆరా తీస్తున్న మోతె గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): కిడ్నాప్‌నకు గురైన యువతి ఆచూకీ రెండు రోజులుగా తెలియకపోవడంతో ఎన్గల్‌లో ఉత్కంఠకు తెరపడడం లేదు. కరీంనగర్ జిల్లా రామడుగు పోలీసులు ఎన్గల్‌లో ఆదివారం సైతం గాలింపు చేపట్టారు. మోతెకు చెందిన యువతిని ఎన్గల్‌కు చెందిన ఐదుగురు శనివారం రాత్రి కిడ్నాప్ చేసిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. మోతె గ్రామస్తులు 60 మందికి పైగా అదే రోజు రాత్రి బైక్‌లతో వెంబడించగా వేములవాడ పరిసర ప్రాంతాల్లో యువకులు తప్పించుకున్నారు. అయినప్పటికీ వారిని పట్టుకునేందుకు వేములవాడలోని కోరుట్ల బస్టాండ్, మల్లారం బస్టాండ్‌లోని హన్మాజీపేట ఎక్స్‌రోడ్డు వద్ద పది మంది చొప్పున గస్తీ కాశారు. మరో 30 మంది ఎన్గల్‌కు చేరుకుని అనుమానిత యువకుల ఇళ్లలో గాలించారు. రామడుగు పోలీసులు సైతం ఎన్గల్‌కు వచ్చి ఆరా తీశారు. ఆదివారం తెల్లవారుజాము వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు.

ముంబై వెళ్లినట్లు ప్రచారం

ఎన్గల్‌కు చెందిన మెరుపుల శ్రీనివాస్‌గౌడ్ తమ కూతురిని కిడ్నాప్ చేశాడని యువతి తల్లి ఫిర్యాదుతో రామడుగు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎన్గల్‌కు చెందిన మరో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. శ్రీనివాస్‌గౌడ్ యువతికి దూరపు బంధువు కావడం, అదే పరిచయంతో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించగా.. యువతి కుటుంబసభ్యులు నిరాకరించినట్లు తెలిసింది. యువతి దూరమైపోతుందని భావించే కిడ్నాప్ చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. శ్రీనివాస్‌గౌడ్ ముంబైలో నివసించేవాడని అక్కడికే వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



'బోన'మెత్తిన సిరిసిల్ల



బోనాలతో తరలివచ్చిన మహిళలు





బోనాల పండుగలో కౌన్సిలర్ సీమాబేగం, జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలో ఆదివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో బోనాలు తీశారు. రెడ్డిసంఘం ఆధ్వర్యంలో తీసిన బోనాలలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పాల్గొన్నారు. మూడోవార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ కళ తదితరులు పాల్గొన్నారు. బీవైనగర్‌లో కౌన్సిలర్ సీమాభేగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బోనాల ప్రదర్శన జరిపారు. స్థానిక పాతపోచమ్మ, బీవైనగర్, వెంకంపేట ప్రాంతాల్లోని పోచమ్మ ఆలయాల్లో అమ్మవారికి మహిళలు బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు, నాయకులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పసిగట్టి పట్టేస్తున్నారు

- నేరాల ఛేదనలో వేగం
- సాంకేతికతతో దర్యాప్తు ముమ్మరం
- సొత్తు రికవరీ.. కటకటాల్లోకి నిందితులు
- సత్ఫలితాలతో ముందుకెళ్తున్న పోలీసులు

"సిమెంట్ విక్రయాలలో రాష్ట్రంలో గుర్తింపు ఉన్న కంపెనీ పేరుకు అక్షరాలను జతచేసిన ఒక ఫేక్ ఐడీతో ఆన్‌లైన్‌లో సరఫరాకు ఒక టోల్‌ఫ్రీ నంబర్ ఇచ్చాడు ఓ బిహార్ సైబర్ నేరగాడు. వీర్నపల్లి మండలానికి చెందిన ఒకరు తన ఇంటి నిర్మాణానికి సిమెంట్ అవసరమని ఆన్‌లైన్‌లో బిహార్ వ్యక్తి క్రియేట్ చేసిన ఫేక్ ఐడీని సంప్రదించాడు. ఈక్రమంలో వీర్నపల్లి వ్యక్తి రూ.2.50 లక్షలు పోగొట్టుకున్నాడు. మోసపోయానని గుర్తించి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. అప్రమత్తమైన పోలీసులు బిహార్ సైబర్ నేరగాడిని అదుపులోకి తీసుకుని నగదు రికవరీ చేశారు.



"'వ్యాపార లావాదేవీలలో భాగంగా ఒకరు వేములవాడ బ్యాంక్‌లో నుంచి రూ.5లక్షలు డ్రా చేసి, కారులో పెట్టుకొని స్థానిక పునరావాసకాలనీలోని బంధువుల ఇంటికెళ్లాడు. ఆరుబయట కారు నిలిపి ఇంట్లోకి వెళ్లగా.. గమనించిన దుండగులు కారు వెనుక అద్దాలు పగులగొట్టి డబ్బును ఎత్తుకెళ్లారు. బాధితుడు వేములవాడ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు దొంగతనం చేసింది కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించి అక్కడికెళ్లి పట్టుకొచ్చారు.

సిరిసిల్లక్రైం: ఈజీ మనీకి అలవాటుపడ్డ కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరగాళ్లుగా కొందరు, నేరుగా దొంగతనాలకు పాల్పడుతూ మరికొందరు డబ్బులు కాజేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆఫర్లు ప్రకటిస్తూ అమాయకులను ఆకర్షిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. నేరాలు చేసే క్రమంలో సాక్ష్యాలను నాశనం చేయడానికి ప్రయత్నించి ఎక్కడో చిన్న తప్పిదం చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. ప్రస్తుతం అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు దొంగలు ఎక్కడ దాక్కున్నా వెదికి మరీ పట్టేస్తున్నారు. ఇటీవల చాలా సంఘటనల్లోనూ నగదు రికవరీ చేశారు. గత నెలలోనే రెండు సైబర్ సంఘటనలను ఛేదించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 86 సైబర్ నేరాలు నమోదయ్యాయి.

టెక్నాలజీ సాయంతో..

ఒకప్పుడు సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం కష్టంగా ఉండేది. ఎక్కడి ప్రాంతం నుంచి కాల్ వచ్చిందో తెలుసుకున్నా అక్కడికెళ్లి పట్టుకునేలోపే ఆ నగదును రికవరీ చేసే అవకాశం ఉండేది కాదు. కానీ ప్రస్తుతం వచ్చిన టెక్నాలజీ సాయంతో వెంటనే నేరస్తుడిని పోలీసులు పట్టుకుంటున్నారు.

- సిమెంట్ సరఫరా చేస్తానని జిల్లా వాసి నుంచి రూ.2.50 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడి ఆచూకీ కోసం పోలీసులు వివిధ మార్గాలలో అన్వేషించారు. చివరికి సైబర్ నేరగాడు వినియోగించిన ఫోన్ ఆధారంగా బిహార్‌కు చెందిన వాడిగా గుర్తించారు. సీఐ మొగిలి, సైబర్ సెల్ ఎస్సై జునైద్, ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ నయీం బిహార్‌కు వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.
- వేములవాడలో జరిగిన నగదు దొంగతనాన్ని ఛేదించడానికి సీసీ కెమెరాల ఫుటేజీని వినియోగించారు. బ్యాంకు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అనుమానితుల ఫొటోలను స్టేట్, సెంట్రల్ క్రైం బృందాలతో పరిశీలించారు. ఇక్కడ జరిగిన దొంగతనం మాదిరి కర్ణాటకలో జరిగినట్లు పోలికలు గుర్తించారు. ఫుటేజీలోని వ్యక్తులు కర్ణాటకకు చెందిన వారిగా తెలిసి వేములవాడ సీఐ వెంకటేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి కర్ణాటకకు వెళ్లి దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకుని అతడు, అతడి అనుచరులు చేసిన నేరాలను ఛేదించారు.

నిందితులు పట్టుబడడం ఖాయం

"తప్పుడు విధానాలలో వెళ్లేవారు కచ్చితంగా పట్టుబడతారు. ప్రస్తుతం ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులు సులభంగా దొరికిపోతారు. ఇదే సమయంలో ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు వస్తువలు వస్తున్నాయని ఆశ్యాశకు పోయి సైబర్‌నేరగాళ్ల వలలో చిక్కొద్దు. నేరాలు జరిగిన తర్వాత బాధపడడం కంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

ఇవీ నమ్మొద్దు

- లాటరీల పెద్దమొత్తం గెలుపొందారని వచ్చే మెస్సేజ్‌లను నమ్మొద్దు. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయంటూ వచ్చే మెస్సేజ్‌లను సైతం నమ్మొద్దు.
- ఇలాంటి మెస్సేజ్‌లు వస్తే నేరుగా 1930లో ఫిర్యాదు చేయండి.
- మీ ఎస్‌బీఐ యూనో బ్లాక్ అయిందని, పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని వచ్చే మెస్సేజ్‌లను అసలు చూడకపోవడమే మంచిది.
- మీ ప్రమేయం లేకుండా మీ సెల్‌ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పకండి. అది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ అని గమనించండి.

క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండలంలోని దుమాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు బట్టు రాజు ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. లబ్ధిదారులు పాముల గణేశ్‌కు రూ.30వేలు, సోమారపు సుప్రజకు రూ.23వేలు, మందాటి ఎల్లంకు రూ.32వేల చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు రేండ్ల మధు, నాయకులు, కదిర భాస్కర్‌గౌడ్, మొగుళ్ల గోపాల్, రామిండ్ల దేవానందం, సూర్య, రాజం, మాధవరెడ్డి, చందు పాల్గొన్నారు.

వీరశైవ జంగమ జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

వేములవాడ: వీరశైవ జంగమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన గొంగళ్ల రవికుమార్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సాంబశివుడు, ప్రధాన కార్యదర్శిగా మంతం రాజశేఖర్, కోశాధికారిగా మృత్యుంజయం, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, రుద్రమణి, సంపత్, సంయుక్త కార్యదర్శిగా కెన్నెర రంజిత్, గొంగళ్ల మునీందర్, ప్రచార కార్యదర్శిగా పర్రె శరత్‌కుమార్, ఉంటే శ్రీధర్‌ను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మనువాడ ప్రశాంత్

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లిలో విలేజ్ బస్ ఆఫీసర్ మనువాడ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సేవలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలోపు విద్యార్థులు, వికలాంగులకు ఉచిత పాసులు అందిస్తున్నట్లు తెలిపారు, శుభకార్యాల కోసం ముందస్తుగా బుక్ చేసుకోవాలన్నారు. ఈ ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పలువురిపై కేసు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన బొనగంటి మల్లయ్య మేకలను అనుమతి లేకుండా తీసుకెళ్లి, డబ్బులు చెల్లించని వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... మల్లయ్యకు చెందిన 10 మేకలను మండలంలోని రంగపేటకు చెందిన రవి రూ.90 వేలకు కొనుగోలు చేశాడు. డబ్బులు చెల్లించకుండా రవితో పాటు, బీర్‌పూర్‌కు చెందిన దుబ్బయ్య, మరికొందరు మల్లయ్య అనుమతి లేకుండా మేకలను ఓ వాహనంలో రంగపేటకు తీసుకెళ్లారు. డబ్బులు చెల్లించాలని మల్లయ్య పలుసార్లు కోరినా, చెల్లించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రవి, దుబ్బయ్యతోపాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు

జోరుగా గుడుంబా తయారీ

- రుద్రంగి మండలంలోని తండాల్లో విక్రయాలు..
- పట్టించుకోని అధికారులు
- మామూళ్లు అందుతుండటంతోనే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

రుద్రంగి (వేములవాడ): రోజూ ఏదో ఓ గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు చేయడం.. గుడుంబా (నాటు సారా), బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడం, నాటుసారా తయారీ దారులపై కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. అయితే అసలు గుడుంబా తయారీకి అవసరమైన బెల్లం పానకాన్ని విక్రయించకుండా చూడాలని, గుడుంబాకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోకుండా ఉండటంతో పాటు ఎవరిపై కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉండదని పలువురు అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు.

రోడ్లపైనే పడిపోతూ..

రోడ్లపై ఎక్కడపడితే అక్కడ మందుబాబులు గుడుంబా తాగుతూ రోడ్లపైనే పడిపోతున్నారు. అధికారులు మాత్రం చుట్టపు చూపుగా వచ్చి దాడులు నిర్వహిస్తూ మామూళ్లు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ సిబ్బంది కనుసన్నల్లోనే గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే ?

అధికారుల కనుసన్నల్లోనే బెల్లం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతినెలా వారికందే మామూళ్ల అందుతున్నాయని, అందుకే ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలకేంద్రంలో..

రుద్రంగి మండల కేంద్రంలోని పలు తండాలు, మానాల, గిరిజన తండా గ్రామాలకు గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

నాటుసారా (గుడుంబా) రహిత గ్రామాలుగా మార్చేందుకు ప్రభుత్వం నాటు సారాను నిషేధించింది. అయితే కొందరు అధికారులు, అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో నాటుసారా తయారీదారులు, బెల్లం విక్రయ దారులపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా వచ్చలవిడిగా గుడుంబాను విక్రయిస్తున్నారు. మందుబాబులు మత్తులో తూగుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

కేసులు నమోదు చేస్తాం

బెల్లం నాటు సారాకే కాక ఇంటి అవసరాలకు కూడా వినియోగిస్తారు. అయితే నాటుసారా తయారీ కోసం బెల్లం విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తాం. కొందరు వ్యాపారులు నాటుసారా కోసం బెల్లం విక్రయిస్తున్నారని సమాచారం తెలిసింది. దాడులు నిర్వహించి వ్యాపార సముదాయాలను సీజ్ చేస్తాం.

–రాము, ఎక్సైజ్ సీఐ, వేములవాడ

‘అల్ఫోర్స్’ ఐసెట్ ర్యాంకర్లకు సన్మానం



విద్యార్థినులను అభినందిస్తున్న రవీందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కాకతీయ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన ఐసెట్–2023 ఫలితాల్లో రాష్ట్రస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి ఆదివారం సత్కరించారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి.జాహ్నవి(108), బి.మేఘన (137), బి.గ్రీష్మ (161), సీహెచ్.హర్షిత (228), అర్పియా జాబీన్ (949), ఎస్.విద్య (995), సమీరా మెహరీన్ (1761), ఇ.అనూష (1950), శ్రావణి (2094)లను అభినందించారు. అలాగే 21 మంది విద్యార్థినులు 5 వేలలోపు, 64 మంది 10 వేలలోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. డిగ్రీతోపాటు ఐసెట్, మ్యాట్, క్యాట్, బ్యాంకింగ్, ఇతర జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు దోహదపడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బూత్‌లను బలోపేతం చేయాలి

- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రానున్న ఎన్నికల్లోపు బూత్‌లను బలోపేతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కరెండ్ల మల్లారెడ్డి, విస్తారక్ నాగరాజు కోరారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని పదిర, హరిదాస్‌నగర్, కోరుట్లపేట, నారాయణపూర్ గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు సత్యంరెడ్డి, వంగల రాజిరెడ్డి, బొమ్మడి స్వామి, రేపాక రామచంద్రారెడ్డి, కిషన్‌రెడ్డి, మురళి, సాగర్, శ్రీకాంత్, రవి, బాబు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం లభించేనా ?

- మూడు రోజుల కింద‘ఠాణా దివస్’లో రామారావుపల్లి రైతుల ఫిర్యాదు
- ఏళ్లనాటి దారికి అడ్డంగా కందకం తవ్విన స్వార్థపరులు
- పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ప్రాంత రైతులు



రామారావుపల్లెలో దారి అడ్డంగా కందకం తవ్విన ఓవర్గానికి చెందిన రైతులు

చందుర్తి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మొబైల్ ఠాణా దివస్‌లో పంట పొలాలకు వెళ్లే దారికి మోక్షం లభించేనా అని మండలంలోని రామా రావుపల్లె గ్రామ రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామశివారులోని పశువుల తొట్టి ఆ ప్రాంతంలో పశువుల బాట గత 50 ఏళ్లకు పైగా ఉందని గ్రామంలోని వృద్ధ రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు వర్గాలుగా ఏర్పడి ఒకరు దారికి అడ్డంగా కందకం తవ్వితే , మరొకరు మరోచోట దారికి అడ్డంగా కందకాన్ని తవ్వి అటుగా వెళ్లే రైతులకు దారిలేకుండా చేశారు. ఈ దారి మల్లన్నగుట్ట ప్రాంతం వరకు వ్యవసాయ భూముల్లోకి దారి ఉంది. రామారావుపేట పంట పొలాలతో పాటు కిష్టంపేట పంటచేలను కలుపుతూ బండపల్లి గ్రామం పోచమ్మ ఆలయం వరకు దారిని గత 15 ఏళ్ల క్రితం పనికి ఆహారం పథకంతో పాటు ఉపాధి హామీ పథకంలో ఈ దారిని రెండుసార్లు మరమ్మతులు చేశారు. ఆ ప్రాంత రైతులు ఎకరానికి రూ.వెయ్యి చొప్పున జమచేసి మరమ్మతులు చేసుకున్నట్లు రైతులు తెలిపారు. గ్రామంలోని కొందరు పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వారు కందకాలు తవ్వే రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రచారం జరుగుతోంది. పంటలు ఇంకా సాగుచేయకపోవడంతో బీడుగా ఉన్న పంటపొలాల నుంచి నుంచి వారి పొలాల వద్దకు వెళ్తున్నారు. తమ వ్యవసాయ పొలాలకు ఎలా వెళ్లాలో తెలియక గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఠాణా దివస్‌లో ఆ ప్రాంత రైతులు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి ఉన్న ఈ దారి సమస్య పరిష్కారంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే ముున్ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని ఆ ప్రాంత రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ దారి సమస్య పరిష్కారమైతే ‘ఠాణా దివస్’పై ప్రజలు, రైతుల్లోనూ నమ్మకం కలుగుతుందని భావిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 2004–05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నాంపల్లిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గార్డెన్‌లో ఆదివారం జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.

మట్టిపెళ్ల కూలి కార్మికుడి మృతి

- మరో కార్మికుడికి తీవ్రగాయాలు



ఎల్లయ్య (ఫైల్)

వేములవాడరూరల్: బావి పనులు చేస్తుండగా మట్టిపెళ్ల కూలి కార్మికుడు మృతిచెందిన సంఘటన వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన చిందం రాజయ్య అనే భూయజమాని బావిలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెనకు చెందిన అలకుంట ఎల్లయ్య (55)తో పాటు శివరాత్రి రాజు, ఆయన కుటుంబ సభ్యులు పని చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పైనుంచి మట్టి పెళ్ల కూలడంతో ఎల్లయ్య, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఎల్లయ్యను కరీంనగర్, రాజును హైదరాబాద్ తరలించగా కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆలకుంట ఎల్లయ్య మృతిచెందాడు. రాజు చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ఎస్సై నాగరాజు విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూయజమాని చిందం రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో ఆదివారం పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆనవాళ్లు కోల్పోతున్న రాజేశ్వరపురం



నాడు వీఐపీలకు విడిదినిచ్చిన రాజేశ్వరపురం వసతి గదులు



నేడు నేలమట్టమైన రాజేశ్వరపురం వసతి గదులు

వేములవాడ : రాజన్నకు చెంతనే రాజేశ్వరపురం వసతి గదులు.. దీనినే కట్టపైన గదులు అంటూ పిలుస్తుంటారు. వీఐపీలు, వీవీఐపీలు సైతం ఇక్కడే బసచేసి ఉదయం రాజన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకునే వారు. అయితే అంత ప్రాచుర్యం కలిగిన ఈ వసతి గదులు ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇటీవల నేలమట్టం అవుతున్నాయి. దీంతో ఆనవాళ్లు కోల్పోతున్న రాజేశ్వరపురం అంటూ భక్తులు, స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ప్రాంతాన్ని ఖాళీగా ఉంచి భక్తుల సౌకర్యాలకు ఉపయోగించనున్నట్లు తెలుస్తోంది.

నీటిగుంతలో పడి మేస్త్రీ మృతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధి భూపతినగర్ శివారులోని భావనకుంట చెరువునీటి గుంతలో పడి మేస్త్రీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. గుంటూరు జిల్లా పెద్దపాలెంకు చెందిన ఒంటి నీడి వీరాంజనేయులు మల్లారపు సాయి వద్ద మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఆదివారం వీరాంజనేయులు భూపతినగర్ శివారులోని భావనకుంట చె రువులోకి బహిర్భూమికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు నీ టిగుంతలో పడి మృతిచెందాడు. మల్లారపు సాయి ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన కర్ర నవీన్, వినయ్ ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వెంకటాపూర్‌కు చెందిన కంకణాల విజయ్ మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో వినయ్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సామూహిక వన భోజనాలు



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామాల్లో ప్రజలు ఆదివారం ఆడవిబాట పట్టారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని అక్కపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో వివిధ కుల సంఘాలు సామూహిక వన భోజనాలకు వెళ్లారు. గ్రామాల ప్రజలు ఆషాఢమాసంలో మొదటి ఆదివారం వన భోజనాలకు వెళ్లడం అనాదిగా వస్తున్న ఆచారం. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సర్పంచ్ ముక్క మధుకర్, ఉప సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, వివిధ కులసంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు



ఆలయానికి వెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు

వేములవాడ : వేములవాడలో ఆర్యవైశ్య వాసవీ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బద్ది పోచమ్మకు బోనాలు నిర్వహించారు. ఆలయంలో మొక్కులు చెల్లించి వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో తాటికొండ వాణి, ఎర్ర మంజుల, మంచాల సౌజన్య, బొడ్ల స్వప్న, జిల్లా హాసిని, శ్వేత, చిట్టిమల్ల వసంత, నాయకులు తాటికొండ పవన్‌కుమార్, ఎర్ర శ్రీనివాస్, రేణికింది అశోక్, అయిత వెంకటేశ్వర్లు, గుండా అశోక్, మంచాల శేఖర్, మోటూరి శ్రీనివాస్, గందె రాజు, గట్టు నగేశ్, ఎర్రం మణికంఠ, ఎర్ర అభిషేక్, దిడిగ రమణ, జిల్ల వేణు, గజవాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మనుమయ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సంఘం నుంచి డప్పు చప్పుళ్ల నడుమ బోనాలతో పలు ఆలయాలకు ఊరేగింపుగా తరలివెళ్లారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలోజి రమ, పాలోజి చందన, నల్లనాగుల కవిత, సంధ్య, చందనం ఉమా, విజయ, రాజేశ్వరి, మణెమ్మ, రత్న, లావణ్య, శ్రీమతి, లయ, పల్లవి, శంకరమ్మ, స్వాతి, లహరి, రుచిత, మానస, రజిత, అనుశ్రీ, శాంభవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రఘుపతి తెలిపారు. ఎల్లారెడ్డిపేట బస్టాండ్ సమీపంలోని తెలంగాణ క్రీడాప్రాంగణంలో సోమ, మంగళవారాల్లో ఉద యం 10 గంటలకు ఎంపిక పోటీలు మొదలవుతాయని పేర్కొన్నారు. నాలుగో తరగతిలో ప్రవేశాలకు 9 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని, ఐదో తరగతికి పదేళ్లలోపు వయ స్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 9963102377, 9989227229, 8008494801 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేములవాడ అర్బన్‌లో..

వేములవాడఅర్బన్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు మంగళవారం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బన్నాజీ తెలిపారు. వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పుట్టినరోజు ధ్రువీకరణపత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

చేపలవేటకు వెళ్లి వృద్ధుడు మృతి

- ఒంటరి అయిన భార్య



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బొమ్మడి నారాయణ(58) ఆదివారం మానేరువాగులో చేపలవేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బొమ్మడి నారాయణ ఆదివారం సాయంత్రం చేపలవేటకు వెళ్లాడు. రాత్రయిన తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు గాలించగా గ్రామ శివారులోని మానేరువాగులో తేలియాడుతూ కనిపించాడు. చీకటి కావడంతో టార్చ్‌లైట్ల వెలుతురులో శవాన్ని బయటకు తీశారు. మానేరువాగులో కరెంట్‌షాక్ పెట్టి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నారాయణ మృతితో అతని భార్య లస్మవ్వ ఒంటరిదైంది. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడికి భార్య లస్మవ్వ, ఇద్దరు కూతుళ్లు బాలసుధ, సంధ్య ఉన్నారు.